# ఇంటి నుంచే ఓటేద్దాం

- 80 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు అవకాశం
- ఇప్పటికే బీఎల్వోల ద్వారా దరఖాస్తుల అందజేత
- 7 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ముథోల్ నియోజకవర్గంలో 3,768 వయో వృద్ధులు

భైంసా, నవంబర్ 4 : వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు అవకాశం కల్పించింది. ఇప్పటికే బీఎల్వోల ద్వారా దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ నెల 7 లోగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. వాటిని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పరిశీలించి ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. ముథోల్ నియోజకవర్గంలో 80 ఏళ్లు దాటిన వారు మొత్తం 3,768 మంది ఉన్నారు. వీరికి ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించే అవకాశం కల్పించనున్నారు. ప్రతిసారి వయోవృద్ధులు ఆరోగ్యం సహకరించక ఓటు హక్కు కోసం ఇబ్బందులు పడేవారు. మరోవైపు తక్కువ మంది పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునే వారు. వీల్‌చైర్‌లో కూర్చొబెట్టి పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లేవారు. ఇదంతా రిస్క్‌తో కూడిన వ్యవహారం కావడంతో చాలా చోట్ల ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం లేదు. దీంతో కేంద్రం ఎన్నికల సంఘం వీరిపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

**12 డీ ఫారం అందజేత..**

ఇంటి నుంచి ఓటు వేసే వారిని గుర్తించి 12 డీ ఫారాలను బీఎల్వోలు అందజేశారు. ఆ దరఖాస్తులను పూరించి తిరిగి నవంబర్ 7 లోగా బీఎల్వోలకు అందజేయాలి. వీటిని ఏఆర్వో పరిశీలించి ఇంటి వద్దే ఓటు హక్కును వినియో గించుకునేందుకు అవకాశం ఇవ్వనున్నారు. వీరి దగ్గరకు మొబైల్ వాహనంలో చేరుకొని అధికా రులు నిర్దేశించిన పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఓటరు రహస్యంగా ఓటు వేసి బ్యాలెట్ బాక్స్‌లో వేస్తారు. ఈ ప్రక్రియ సాధారణ ఎన్నికలకు ఒక రోజు ముందుగానే పూర్తి చేయనున్నారు.

### చాలా సంతోషంగా ఉంది..



కొన్ని ఏళ్ల నుంచి ఏ ఎన్నికలు వచ్చినా ఓటు వేస్తున్నా. ఇప్పటి వరకు కారు లేదా ఆటోలో వెళ్లి పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడేవాడిని ఓటు వేయాలంటే ఇబ్బందులు పడేవాళ్లం. మళ్లీ ఇంటికి రావాలంటే ఎంతో ప్రయాసగా ఉండేది. ఇప్పుడు వృద్ధులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించడం చాలా సంతోషంగా ఉంది.

- దిగంబర్ మాశెట్టివార్(భైంసా)

### ఇబ్బంది తప్పినట్టే..



నా వయస్సు ఇప్పుడు 84 ఏళ్లు. ఎన్నికలు వచ్చాయంటే ఓటు వేయడానికి కష్టాలు ఉండేవి. ఇతరుల సహకారంతో వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేది.నాలాంటి వాళ్లకు ఓటు ఇంటి వద్దే వేయడానికి అవకాశం కల్పించడం మంచిది. ఇలా అయితే ఓటు వేయడానికి ఇబ్బంది తప్పినట్టే. నా ఓటును ఇంటి నుంచే వేస్తాను.

- నీలావతి(భైంసా)



మాట్లాడుతున్న ఏపీపీ అరుణ

# పోలీసులతో ఏపీపీ సమావేశం

భైంసా, నవంబర్ 4 : భైంసాలోని కోర్టులో డివిజన్ పోలీసు అధికారులతో శనివారం ఏపీపీ అరుణ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా జరిగిన నేరాలు, వాటి విచారణ, కోర్టులో పెండింగ్, పరిశోధన సంబంధిత కేసులపై చర్చించేందుకు సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. అంతేకాకుండా కేసుల పరిష్కారానికి సూచనలు, సలహాలు అందించామని తెలిపారు. ఇందులో పట్టణ సీఐ ఎల్ శీను, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారుల దాడులు

దస్తురాబాద్, నవంబర్ 4 : మండలంలోని మున్యాల తండా, ఎర్రగుంట, రేవోజీపేట, చెన్నూర్, బుట్టాపూర్ గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ శాఖ ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 1300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 17 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది ముత్యం, నిరోషా, కల్పన, వెంకటేశ్, భాస్కర్ పాల్గొన్నారు.



బెల్లం పానకాన్ని పట్టుకున్న ఎక్సైజ్ ఎస్ఐ రమేశ్

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం




వానల్‌పాడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

భైంసాటౌన్, నవంబర్ 4 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో శనివారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు.స్థానిక నాయకులు రాంకుమార్, ఉప సర్పంచ్ దగ్గే ఈశ్వర్, కారోబార్ నారాయణ, వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**కేంద్రాలను వినియోగించుకోవాలి**

కుంటాల, నవంబర్ 4 : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ప్యాక్స్ కార్యదర్శి నాగభూషణ్ పేర్కొన్నారు. కుంటాల, అంబకంటి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రకం వరి ధాన్యానికి  రూ. 2203, రెండో రకం ధాన్యానికి రూ. 2183 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు దళారులకు విక్రయించకుండా సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. సంఘం సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కుంటాల : అంబకంటిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్యాక్స్ అధికారులు

# ఘనంగా సప్తాహ వేడుకలు ప్రారంభం

కుభీర్, నవంబర్ 4 : మండలంలోని పార్డి(కె) గ్రామంలోని దక్షిణముఖి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉదయం తాళ సప్తాహ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయంలో గణపతి, ఆంజనేయ స్వామి, శివాలయంలో శివలింగానికి సంజీవ్, జంగం రాజు మహారాజ్ అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తాహ కలశాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. ఆలయం ముందు ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో వార్ఖరీ భక్తులు భజనలు చేస్తూ వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఏడు రోజుల పాటు ఈవేడుకలు కనుల పండువగా కొనసాగను న్నాయి. చివరి రోజు 11వ తేదీ మహా అన్నదానంతో వేడుకలు ముగుస్తాయి. కార్యక్రమంలోసర్పంచ్ ఆకుల గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు బందెల శంకర్, పీఏసీఎస్ సీఈవో ఎగ్గం క్రాంతికుమార్, డబ్ల్యూయూపీ మాజీ చైర్మన్ ఎగ్గం విఠల్, మాజీ సర్పంచ్ పోశెట్టి, వీడీసీ మాజీ అధ్యక్షుడు లంక పోశెట్టి, గోజల గజ్జారాం, వెంకటి, బీఆర్ఎస్ నాయుడు దొంతుల సాయన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

## నేడే అంబకంటి తండాలో విగ్రహ ప్రతిష్ఠాపన




హోమం నిర్వహిస్తున్న పండితులు

కుంటాల, నవంబర్ 4 : మండలంలోని అంబకంటి తండాలో శ్రీ జగదాంబ, రామ్‌రావు మహారాజ్, పాదుకా, తాబేల్, నంది, గుర్రం విగ్రహల ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా శనివారం పండితులు భగవాన్ జోషి, వినయ్‌పాండే ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీక్షగురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆది వారం విగ్రహాల ప్రతిష్ఠాపన జరుగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ సర్పంచ్ జాదవ్ శంకర్, మాజీ జడ్పీటీసీ రాథోడ్ విమల, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీకి ఘన సన్మానం

ఖానాపూర్ రూరల్, నవంబర్ 4 : ఖానాపూర్‌లోని ఆరో వార్డు మైనార్టీ నాయకు లు, బావపూర్ (ఆర్), రాజురా, చందునాయక్ తండాలోని బీఆర్ఎస్ నాయకులు పెంబి జడ్పీటీసీ భూక్యా జానుబాయిని  సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, ఇర్ఫాన్, షోయబ్, మెహరాజ్, చిన్నం రవి, ఏరకేరి మల్లేశ్, షాకీర్, పులివేని సత్యనారయణ, చిలివేరి మల్లేశ్, పెద్ది రాజు, లింగన్న, శ్రీనివాస్  మహేశ్ పాల్గొన్నారు.



జడ్పీటీసీ జానుబాయిని సన్మానిస్తున్న నాయకులు